
www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 28 మార్చి 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





వైద్య రంగానికి పెద్దపీట : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు : సామాన్యులకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో జిల్లాకు నూతనంగా మంజూరైన ఏడు 104 అంబులెన్స్‌లను జెడ్‌పి చైర్పర్సన్ ఆనం అరుణమ్మతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు అత్యవసర, నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించేందుకు 104, 108 వాహనాలు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ మారు మూల గ్రామాలకు సైతం మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జిల్లా వైద్యాధికారి పెంచలయ్య, జెడ్‌పి సిఇఒ చిరంజీవి, 104, 108 అంబులెన్స్ జిల్లా మేనేజర్ పవన్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న అరుణమ్మ


టిడిపిలో నాటకీయ రాజకీయ పరిణామాలు..!

○చంద్రబాబుతో "అజీజ్" భేటీ
○లోకేష్‌ని కలిసిన "కోటంరెడ్డి"
○అందరూ కలిసి పనిచేయాల్సిందే చంద్రబాబు ఆదేశాలు..

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు జిల్లా పార్టీని, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని రాజకీయ పరిణామాలను గాడిలో పెట్టేపనిలో ఉన్నారు. హైదరాబాద్‌లోని చంద్రబాబునాయుడు నివాసంలో అబ్దుల్ అజీజ్‌తోపాటు, ముఖ్యనేతలతో ఆది, సోమవారాలు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ఇటీవల టిడిపిలో చేరిన కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాదయాత్రలో కలిశారు. ఓ వైపు, తండ్రి, మరో వైపు తనయుడు నెల్లూరు జిల్లాపై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు కనిపిస్తోంది. నేతల మధ్య ఉన్న విభేదాలు పక్కనపెట్టి పార్టీ విజయానికి కృషిచేయాలని ఇద్దరు నేతలు చెప్పినట్లు తెలుస్తోంది. అజీజ్‌కు చంద్రబాబునాయుడు స్పష్టమైన హామీ ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. 2024 ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేస్తావని చెప్పినట్లు సమాచారం. టిడిపి నేతలు వైసిపిని గద్దె దించే వ్యూహాంతో ముందుకు నడుస్తున్నట్లు కనిపిస్తోంది..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

తెలుగుదేశం పార్టీలో ఇప్పుడు వలస నేతలు క్యూ కడుతున్నారు. వైసిపి నుంచి ముగ్గురు ఎంఎల్‌ఎలు జిల్లాలో వెనక్కు వచ్చారు. నెల్లూరు రూరల్, వెంకటగిరి, ఉదయగిరి నియోజకవర్గ ఎంఎల్‌ఎలు దాదాపు టిడిపి వైపు చూస్తున్నారు. నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి టిడిపిలో చేరడం దాదాపు ఖరారైంది. అక్టోబర్‌లో చేరనున్నారు. ముందుగా ఆయన సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఇటీవల చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సమయంలో జిల్లాలోని ముఖ్యనేతలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అబ్దుల్‌అజీజ్ హాజరు కాలేదు. మూడేళ్ల నుంచి నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జ్‌గా అబ్దుల్ అజీజ్ పని చేస్తున్నారు. అప్పటి వైసిపి ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో ఆయన యుద్ధమే చేస్తున్నారు. విమర్శలు, ప్రతి విమర్శలతో నువ్వెంతంటే... నువ్వెంతంటూ ముందుకు సాగారు. రాజకీయాలు ఎప్పుడు ఎలా మారుతాయో ఎవరికి తెలీదు. ఊహించని విధంగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వైసిపి నుంచి బయటకొచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో టిడిపిలో పనిచేయడమే మంచిదనే అభిప్రాయానాకి ఆయన వచ్చారు. వైసిపి అధిష్టానం ఆయనను శత్రువుగా చూస్తున్నారు. 2024లో నెల్లూరు రూరల్ టిడిపి అభ్యర్థిగా పోటీచేస్తానని చెబుతున్నారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు నెల్లూరు రూరల్ టిడిపిలో పనిచేసిన నేతలు రాజకీయ భవిష్యత్తు ఏమిటో అర్థంకాని పరిస్థితులు నెలకొన్నాయి. 2024 ఎన్నికల టిడిపికి చావో, రేవో అన్నట్లు ఉంది. ఈ ఎన్నికల్లో ప్రతి ఓటు, సీటు ఆపార్టీకి ముఖ్యమే. అందుకే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోదరులను పార్టీలోకి తీసుకోవాలని అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం, అబ్దుల్ అజీజ్‌తోపాటు, కొందరి నేతలకు మింగుడు పడడం లేదు. నిన్నటి వరకు పోరాటం చేసిన వ్యక్తితో కలిసి పనిచేయడం కుదరదని తేల్చి చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పుడ రాజకీయ పరిస్థితులు చక్కపెట్టడానికి టిడిపి అధినేత చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ దృష్టిపెట్టారు. ఇటీవల కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి టిడిపిలో చేరారు. అక్టోబర్‌లో శ్రీధర్‌రెడ్డి పార్టీలో చేరడానికి సిద్ధ పడుతున్నారు. మరో వైపు ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి క్యూలో ఉన్నారు. వీరు కాకుండా మరికొందరు వైసిపి నేతలు టిడిపి వైపు చూస్తున్నారు. తొలుత నెల్లూరు రూరల్‌లో నెలకొన్న అనిశ్చితిని చక్కబెట్టడానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం మధ్యాహ్నం 1.30 గంట నుంచి గంట, సోమవారం 3నుంచి 4.30 గంటల వరకు మరోసారి చంద్రబాబునాయుడు జిల్లా ముఖ్యనేతలతో భేటీ అయ్యారు. మాజీ మంత్రి పి.నారాయణ, బీద రవిచంద్ర, అబ్దుల్ అజీజ్, ఆయన సోదరులు అబ్దుల్ జలీల్ చంద్రబాబునాయుడుని కలిశారు. పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నెల్లూరులో ఉండడంతో ఈ సమావేశానికి వెళ్లలేదు. గిరిధర్ యువగళంలో నారా లోకేష్‌ను కలిశారు. ఇప్పుడు ఇది జిల్లాలో చర్చనీయాంశమైంది.


నారా చంద్రబాబునాయుడును కలిసిన అబ్దుల్ అజీజ్

నీ బాధ్యత నాది..అజీజ్‌కు బాబు హామీ..!

"పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్నావ్.. ఎవరి పరిస్థితి ఏమిటో నాకు బాగా తెలుసు. 2024 ఎన్నికలు చాల ముఖ్యమైనవి. చావో, రేవో అన్నట్లు జరుగుతాయి. రాష్ట్ర ప్రయోజనాల కోసం అనేక మంది త్యాగాలు చేయాల్సి ఉంటుంది. నీ బాధ్యత నాది.. వచ్చే ఎన్నికల్లో పోటీలో ఉంటావ్.. ఎక్కడ నుంచో చెప్పలేదు. నెల్లూరు రూరల్, నెల్లూరు సిటీ, ఎంపి.. ఎక్కడ నుండైనా పోటీచేయొచ్చు. ఎలాంటి ఆందోళన చెందొద్దు. పార్టీ విజయానికి కష్టపడి పనిచేయాలి" అని చంద్రబాబునాయుడు స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. దీంతో అబ్దుల్, జలీల్ సుముఖత వక్తం చేసి, పార్టీకోసం పనిచేస్తామని చెప్పివచ్చినట్లు సమాచారం.

పార్టీ విజయానికి కృషి చేయండి..!
'కోటంరెడ్డి'తో నారా లోకేష్

ఇటీవల టిడిపిలో చేరిన వైసిపి రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సోమవారం యువగళంలోని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిశారు. కోటంరెడ్డికి విశ్రాంతి వద్ద ఉన్న నేతలను పరిచయం చేశారు. జిల్లాలో పార్టీ విజయానికి కృషిచేయాలని, అందరినీ కలుపుకువెళ్లాలని, అన్ని స్థానాల్లో టిడిపి విజయం సాధించేలా అందరూ కలిసి పనిచేయాలని సూచన చేసినట్లు తెలిసింది.


యువగళం పాదయాత్రలో లోకేష్‌బాబును కలిసిన కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

సర్వజన ఆస్పత్రిలో
మౌలిక సదుపాయాలు కల్పించాలి

కలెక్టర్‌కు సిపిఎం వినతి


ప్రజాశక్తి-నెల్లూరు : సర్వజన ప్రభుత్వ ప్రధాన వైద్యశాల (జిజిహెచ్)లో గత కొన్ని నెలలుగా పనిచేయనటువంటి 8 లిఫ్టులకు మరమ్మత్తులు చేయాలని, ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని కోరుతూ సిపిఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి వైద్య చికిత్సల కోసం జిజిహెచ్‌కి వస్తుంటారన్నారు. గత కొన్ని నెలలుగా 8 లిస్టులు పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎంఆర్ఐ, సిటీ స్కాన్ రిపోర్టులు సకాలంలో అందజేయకపోవడం వల్ల రోగులకు అందే వైద్య సేవలకు విఘాతం కలుగుతుందన్నారు. అన్ని రకాల ల్యాబ్ టెస్టులు, మందులను అందుబాటులోకి తీసుకురావాలని, పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బందికి పెండింగ్ బకాయిలను చెల్లించాలని కోరారు. ప్రజారోగ్యనికి సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కష్ణయ్య , కార్యదర్శి వర్గ సభ్యులు కిన్నెర కుమార్ ,కొండా ప్రసాద్ రూరల్ కమిటీ సభ్యులు వీర్ల శ్రీనివాసులు , శాఖ కార్యదర్శి ఒంగోలు సుధీర్ , డివైఎఫ్ఐ రూరల్ కార్యదర్శి కండె కోటేశ్వరరావు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

మహిళ కడుపులో కణితి తొలగింపు

ప్రజాశక్తి-నెల్లూరు

గడిచిన మూడు నెలలుగా కడుపు నొప్పి, ఉబ్బసం వంటి అనారోగ్య సమస్యతో బాధపడుతున్న అలివేలమ్మ (24) మహిళకు డాక్టర్లు శస్త్ర చికిత్స నిర్వహించి బాధితురాలి కడుపులోని 6 కిలోల కణితను తొలగించారు. సోమ వారం నగరంలోని మెడికవర్ వైద్యశాలలో విలేకర్ల సమావేశంలో వైద్యులు ఈ శస్త్ర చికిత్సలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మెడికవర్ ఆస్పత్రికి అలివేలమ్మ అనే మహిళ ఇటీవలకడుపు నొప్పితో బాధపడుతూ వైద్యచికిత్సల నిమిత్తం వెళ్లింది. వైద్యశాలకు చెందిన సర్జికల్ అంకాలజీ విభాగానికి చెందిన డాక్టర్ అవినాష్ బాధితురాలకి పరీక్షలు నిర్వహించే క్రమంలో సీటీ స్కాన్ చేయగా గర్భాశయంలో పెద్ద కణిత ఉన్నట్లు గుర్తించారు.ఆ కణితి గర్భాశయాన్ని పూర్తిగా ఆక్రమించడంతో కడుపు నొప్పి వస్తున్నట్లు నిర్ధారించారు. కణితికి కేన్సర్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే శస్త్రచికిత్స నిర్వహించాలని రోగి కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ బాధితురాలి కుటుంబ సభ్యుల అంగీకారంతో శస్త్ర చికిత్స నిర్వహించి 30 సెంటీమీటర్ల వ్యాసార్ధంతో 6 కిలోల బరువున్న కణితను తొలగిం చామన్నారు. రోగి పూర్తిగా కోలుకుని డిశ్చార్జి అయినట్లు పేర్కొన్నారు. కణితకు క్యాన్సర్ లక్షణాలు ఉండటంతో ఆపరేషన్ సమయంలో పలు జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. ఈ ఆపరేషన్‌ను ఆరోగ్య శ్రీ పథకంలో నిర్వహించామన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న వైద్యుడు

'ఆసరా' చెక్కు పంపిణీ

ప్రజాశక్తి -కందుకూరు : సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వైఎస్ఆర్ ఆసరా మూడో విడత సంబరాలు కార్యక్రమాన్ని సోమవారం ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్ రెడ్డి ప్రారంభించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్ రెడ్డి హాజరై కందుకూరు మండలానికి చెందిన 854 స్వయం సహాయక సంఘాల గ్రూపులకు రూ. 7 కోట్ల 15 లక్షల చెక్కును అందజేశారు. నెల్లూరు జిల్లా డ్వాక్ర పీడి, కందుకూరు తాసీల్దార్ డి సీతరామయ్య, ఎంపీడీఓ వియజ శేకర్, ఎంపీపి ఇంటూరి సుశీల, జేడ్పీటీసి తోట్టేంపూడి అనసూర్య, కందుకూరు మండల వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసిలు ఉన్నారు.


చెక్కు అందజేస్తున్న ఎంఎల్‌ఎ

'పది' విద్యార్థులకు సూచనలు

ప్రజాశక్తి-నెల్లూరు : పదోతరగతి విద్యార్థుల జీవితానికి దశ దిశ నిర్ధేశనం చేస్తుందని డాక్టర్ కె.చిరంజీవి పేర్కొన్నారు. సోమవారం బుజబుజ నెల్లూరు, డి.వి.ఎన్.ఎం. జెడ్‌పి హై స్కూల్లో, పిఎంపి ఆధ్వర్యంలో నిర్వహించిన సరస్వతి పూజా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సూచనలు చేశారు. మంచి ర్యాంకు తెచ్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన కోరారు. పదో తరగతిలో మంచి మార్కులు తెచ్చుకొని ఎందరో ఉన్నత స్థాయికి ఎదిగారని ఆయన పేర్కొన్నారు. 29,25 డివిజన్ కార్పొరేటర్లు బద్దిపూడి గిరి, షేక్ సత్తార్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలని పి.ఎం.పి అసోసియేషన్ ప్రతి సంవత్సరం విద్యార్థులకు ఎగ్జామ్ మెటీరియల్స్ అందజేయడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. అనంతరం పిఎంపి ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్లు, స్కేలు పంపిణీ చేశారు. పి.ఎం.పి గౌరవాధ్యక్షులు అనుమల జయప్రకాష్, పాఠశాల హెచ్ఎం జాకీరా ఖానం, పాఠశాల వ్యవస్థాపకులు దూడల వెంకయ్య, ప్రసాద్ రావు, రూడ్స్ చైర్మన్ షేక్ రసూల్, పి.ఎం.పి అధ్యక్షులు శాఖవరపు వేణు గోపాల్, డివిజన్ కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసులు, విశ్రాంత ఆర్టిసి ఉద్యోగి యస్.సాయి, నగళ్ల రామకష్ణ, డి.సురేంద్ర, రమేష్, ఉపాధ్యాయులు అచ్యుత మణి పాల్గొన్నారు.



మానసిక ఆరోగ్యం ముఖ్యం

ప్రజాశక్తి -కందుకూరు : స్థానిక టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం వారి ఆధ్వర్యంలో సోమవారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఒంగోలులోని సిఎస్ఆర్ శర్మ కళాశాల విశ్రాంత ఆంధ్రాచార్యులు ఎ విశ్వనాథం హాజరై మాట్లాడారు. విద్యార్థులు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతోపాటు జీవన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నరేంద్ర, ఏడుకొండలు అధ్యక్షత వహించారు. తెలుగు విభాగాధిపతి కె. సుజాత, తెలుగు అధ్యాపకులు షేక్ షానాజ్ బేగం నిర్వహించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి -రాపూరు : మండలంలోని పెంచలకోన క్షేత్రంలో పెనుశిల లక్ష్మీ నసింహ స్వామి ఆలయంలో సోమవారం హుండీ ఆదాయం లెక్కించారు. 21.12.2022 నుంచి 27.3.2023 వరకు వరకు సంబంధించిన ఆదా యాన్ని లెక్కించారు.హుండీ లెక్కింపునకు ఆలయ ధర్మకర్తమండలి సభ్యులు, ప్రధాన అర్చకులు పర్యవేక్షణలో ఈ హుండీ ఆదాయం లెక్కింపు జరిగింది.

కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి -కందుకూరు : స్థానిక త్యాగరాజ స్వామి గుడిలో వివాహ సంబంధాలకు సంబంధించిన కరపత్రం సోమవారం విడుదల చేశారు. నాయి బ్రాహ్మణులకు ఖర్చు లేకుండా అందించే సంకల్పంతో నిర్వహిస్తున్న విహవ పరిచయ కార్యక్రమం ఒంగోలులో ఏప్రిల్ 8న జరుగుతుందని వివాహ వేదిక పరిచయ కన్వీనర్ రాఘవ బుక్ స్టాల్ ప్రొప్రైటర్ నాదెళ్ల రాఘవ తెలిపారు. ఎపి నాయి బ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి వల్లూరి కోటేశ్వరరావు, పోతకమూరి మధుబాబు పాల్గొన్నారు.

'స్పందన' అర్జీలకు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి-నెల్లూరు

'స్పందన' సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన 'స్పందన'లో కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు, సంయుక్త కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, డిఆర్ఒ వెంకటనారాయణమ్మ పాల్గొని అర్జీలు స్వీకరించారు. తొలుత జిల్లా అధికారులనుద్ధేశించి కలెక్టర్ మాట్లాడారు. స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సంబంధిత శాఖలకు చెందిన అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని సూచించారు. జెడ్‌పి సిఇఒ బి.చిరంజీవి, డిఆర్‌డిఎ, డ్వామా, ఏపీఎంఐపీ, గృహ నిర్మాణసంస్థ పీడీలు కె.వీ. సాంబశివరెడ్డి, వెంకటరావు, శ్రీనివాసులు, వెంకట దాసు, పంచాయతీ రాజ్, జలవనుల శాఖ ఎస్ఈలు అశోక్ కుమార్, కష్ణమోహన్, డిఇఒ గంగాభవాని పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

కమిషనర్ కార్యాలయంలో...

ప్రభుత్వం ఉన్నత ఆశయాలతో నిర్వహిస్తున్న స్పందన వేదికలో అందే ఫిర్యాదుల పరిష్కారంలో నగర పాలక సంస్థ అన్ని విభాగాల సిబ్బంది నిబద్ధత పాటించాలని, నిర్దేశించిన గడువులోపు సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించాలని కమిషనర్ హరిత అధికారులకు సూచించారు. కార్పోరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన వేదికలో ఫిర్యాదుదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఎస్‌పి కార్యాలయంలో...

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి స్పందన కనిపించింది. ఈ కార్యక్రమంలో 86 మంది బాధితుల నుంచి ఫిర్యాదుల రూపంలో అర్జీలను అధికారులు స్వీకరించారు. ఎస్‌పి సిహెచ్ విజయరావు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోని అనుమానాస్పద, మిస్సింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

'చలో కలెక్టరేట్' వాయిదా

ప్రజాశక్తి-నెల్లూరు

ఆటో కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తామని ట్రాఫిక్ డిఎస్‌పి హామీ ఇచ్చారు. సోమవారం జిల్లా ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆటోలపై ట్రాఫిక్ పోలీసులు విధిస్తున్న ఈ చలానా రద్దు చేయాలని, ఆటో చోరీలను అరికట్టాలని, పోలీసు నెంబర్ల పేరుతో ఏజెన్సీ నిర్వాహకుల దోపిడి నివారించాలని డిమాండ్ చేస్తూ చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టాలని పిలుపు నిచ్చాయి. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ డిఎస్‌పి ఆటో యూనియన్ నాయకులను చర్చలకు ఆహ్వానించారు. ఈ చర్చల్లో పాల్గొన్న ఆటో యూనియన్ జిల్లా నాయకులు మాట్లాడుతూ ఆటో కార్మికుల జీవితాలు భారంగా మారాయని, ఈ తరుణంలో పోలీసులు ఈ చలానాల పేరుతో ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. నగరంలో ఇటీవల ఆటో దొంగతనాలు ఎక్కువయ్యాయని, ఆటో పార్కింగ్ చేస్తే ఆటోలోని బ్యాటరీలు, టైర్లతో పాటు ఆటోల సైతం చోరీకి గురవుతున్నాయన్నారు. నిఘా ఏర్పాటు చేసి దొంగలను అరికట్టాలని కోరారు, పోలీస్ నెంబర్ల పేరుతో రెన్యువల్ పేరుతో ఏజెన్సీలు గ్రామీణ ప్రాంత ఆటోలో నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని, ఆటో డ్రైవర్లకు ఏజెన్సీ నిర్వాహకులు బెదిరిస్తున్నారని తెలిపారు, ట్రాఫిక్ డిఎస్‌పి స్పందిస్తూ వఈ చలానాలపై పరిశీలిస్తామని, దొంగతనాలు నివారణకు ప్రత్యేక బందాలు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు నాయకులు తెలిపారు. ఆటో యూనియన్ జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు మారుబోయిన రాజ, కె.సురేష్, కోశాధికారి వెంకయ్య ,జిల్లా సహాయ కార్యదర్శి ఎం. సుధాకర్, జిల్లా నాయకులు బుచ్చి రాధయ్య ,రాజుపాలెం సురేష్ పాల్గొన్నాను.



ట్రాఫిక్ సిఐకి వినతిపత్రం అందజేస్తున్న ఆటో కార్మిక సంఘం నాయకులు

రంజాన్‌లో 'రియాజ్' సేవలు

ఉచితంగా ఆహారం సరఫరా

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

రంజాన్ సందర్భంగా ఉపవాస దినాల్లో ముస్లిం సోదరులకు ప్రముఖ రియాజ్ హోటల్ యజమాని, రియాజ్ పలు సేవ కార్యక్రమాలు చేపట్టారు. గత 22 ఏళ్ల నుంచి పవిత్ర రంజాన్ మాసంలో ఉప వాసం ఉండేవారికి ఉచితంగా ఇఫ్తార్ అందిస్తున్నారు. కరోనా సమయంలో వేలాది మంది నిరుపేదలకు తమ హోటల్ నుంచి ఉచితంగా భోజనం అందించి పలువురి ప్రశంశలు అందుకున్నారు. తన వ్యాపారంలో సంపాదించిన దానిలో కొంత బాగం సేవా కార్యాక్రమాలకు వినియోగిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ముస్లిం సోదరులు ఉప వాసాలుంటారు. తెల్లవారు జామున 4. గంటలకు జావ సరఫరా చేస్తు న్నారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నారు. రంజాన్ మాసంలో తెల్లవారు జామున పాత జెడ్‌పి ప్రాంతం ముస్లీం సోదరులతో కోలా హాలంగా మారు తుంది. ఈ కార్యక్రమాన్ని ఈనెల 24న నగరంలో ప్రారంభించారు. ప్రతి రోజు వందలాది మంది దీనిని వినియోగించుకుంటున్నారు. సుమారు నెల రోజులపాటు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు రియాజ్ తెలిపారు.


రియాజ్



రియాజ్ హోటల్


నివాళి అర్పిస్తున్న మంత్రి కాకాణి

వైసిపి నేత 'కాల్తిరెడ్డి'కి పితృవియోగం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

వైసిపి నాయకులు, తోటపల్లిగూడూరు మండలం మండపం గ్రామ పం చాయతీ సర్పంచ్ కాల్తిరెడ్డి సుబ్రహ్మణ్యం (సుబ్బారావు)కు పి తవియోగం కలిగింది. ఆయన తండ్రి సుబ్బరామ య్య (98) సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సుబ్బరా మయ్య మత దేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. కుటుంబ స భ్యులకు తన ప్రగాఢ సాను భూతి తెలిపారు. మంత్రి వెంట విజయ డైరీ మాజీ చైర్మన్, చిల్లకూరు సుధీర్ రెడ్డి, వైసీపీ మండల క న్వీనర్ ఉప్పల శంకరయ్య గౌ డ్, వైసిపి నాయకులు, ఇసనాక రమేష్ రెడ్డి, మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, ముత్తుకూరు జెడ్‌పిటిసి నెల్లూరు ప్రసాద్, మెట్టా విష్ణువర్ధన్ రెడ్డి ఉన్నారు.

శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఓ చిన్నారి శస్త్ర చికిత్సకు ఆర్థిక సాయం అందించారు. మండలంలోని నరుకూరు దళితవాడకు చెందిన గోగనపల్లి మల్లిఖార్జున, వరమ్మల మనవరాలు ఐదేళ్ల చిన్నారి పావని గుండె సంబంధిత వ్యాధితో బాధప డుతోంది. విషయం తెలుసుకున్న అదే గ్రామంలోని తెలుగు బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో నడుస్తున్న "హెల్పింగ్ హాండ్స్" అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా ఆర్థిక సాయం చేసింది. ఈ మేరకు చర్చ్ చైర్మన్ సాదేపల్లి బోయదాస్, సెక్రెటరీ సాదేపల్లి బాల ప్రసాద్, ట్రెజరర్ దువ్వూరు కోటేశ్వరరావు, యూత్ కరేటి బాబు, కోడి వివేక్, సాదేపల్లి భారత్, వాకాటి విజయ్ కుమార్ తదితరులు చిన్నారి అవని అవ్వ తాతలకు రూ. రూ.10 వేలు అందజేశారు.

మాజీ ఎంపిపి బాలకృష్ణారెడ్డి మృతి

ప్రజాశక్తి -రాపూరు

ఎఎంసి మాజీచెర్మన్, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మాజీ మండల పరిషత్ అధ్యక్షులు చెన్ను బాలకష్ణారెడ్డి సోమవారం బెంగుళూరులోని తన నివాసంలో గుండె పోటుతో మృతిచెందారు. భౌతికఖాయాన్ని బెంగుళూరు నుంచి రాపూరు మండలంలోని తన స్వగ్రామమైన సంక్రాంతి పల్లి తీసు కొచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన నివాసానికి ఎంఎల్‌ఎ ఆనం రామనారాయణ రెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి, మాజీ ఎంఎల్‌ఎ కురుగొండ్ల రామకష్ణ, నాయకులు మెట్టుకూరు ధనుంజయ రెడ్డి , కొమ్మి లక్ష్మణ నాయుడు తదిరుతులు చేరుకున్నారు. బాలకృష్ణారెడ్డి భౌతిక ఖాయానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

టిడిపి మైనారిటీ కమిటీ ఎంపిక

ప్రజాశక్తి -పొదలకూరు

టిడిపి పొదలకూరు మండల మైనార్టీ కమిటీ నూతన కార్యవర్గాన్ని మాజీమంత్రి టిడిపి జాతీయ పోలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సోమవారం ఎంపిక చేశారు. మండల మైనారిటీ అధ్యక్షులుగా షేక్. ఖాదర్ బాషా, ఉపాధ్యక్షులుగా షేక్.బాబులు, రఫీ జనరల్ సెక్రటరీగా ఎస్.కె ఖాదర్ బాషా ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ముక్తియార్, ఎస్.డీ మస్తాన్, మహమ్మద్ అబ్దుల్లా, సెక్రటరీలుగా షేక్ చినికి సాహెబ్ ,షేక్.వలీ సాహెబ్, నజీర్ భాష ,ట్రెజరర్ గా ఖాజావలి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా మహమ్మద్ రఫీ, ఖాదర్ నవాజ్, ఖాదర్ బాషా, ఎస్.కె.షబ్బీర్ లను ఎంపిక చేశారు. నూతనంగా ఎంపికైన కార్యవర్గం మాజీ మంత్రి సోమిరెడ్డికి కతజ్ఞతలు తెలిపారు.

సామాజిక భవనాలు నిర్మించాలి

ప్రజాశక్తి-కావలి

సమాజంలో నిరుపేదలైన గిరిజనులు నివసించే కాలనీలో సామాజిక భవనాలు నిర్మించి, వారిని అభివృద్ధి చేయాలని జిల్లా ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి జిల్లా అధికారులను కోరారు. గిరిజన కాలనీలకు మౌలిక వసతులు కల్పించి వారికి గిరిజన సంక్షేమ పథకాలు అందించి సమాజంలో సాంఘికంగా, ఆర్థికంగా, సామాజికంగా, అభివృద్ధి చేయాలని కోరారు. భారత రాజ్యాంగం నిర్మాతలు కలలు కన్న ఆశయాలను ప్రజాప్రతినిధులు, అధికారులు, త్రికరణ శుద్ధిగా ఆచరించి గిరిజనులను చైతన్య పరచి ప్రభుత్వ పథకాలు అందుకునే విధంగా వారిని ప్రోత్సహించి కాలనీలను ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సందర్శించి వారి అభ్యున్నతకు కృషి చేయాలన్నారు.

సేంద్రియ ఎరువులను వాడాలి

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్


మాట్లాడుతున్న ఎంపిపి కేతా వేణుగోపాల్‌రెడ్డి

సేంద్రియ ఎరువులును ఎక్కువగా తయారు చేసి రైతులు ఉపయోగించే విధంగా ప్రోత్సహించాలని ఆత్మకూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కేతా వేణుగోపాల్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కరటంపాడు చెత్తసంపద కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆఖరి శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం సేంద్రియ ఎరువులను ప్రోత్సహిస్తుందని, రైతులకు సేంద్రీయ ఎరువుల వాడకం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు తెలియజేసి వారిని ప్రోత్సహించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపిడిఒ సి.శ్రీనివాసులు, మర్రిపాడు, అనంతసాగరం మండలాల విస్తరణ అధికారులు మస్తాన్ ఖాన్, ప్రసాద్ రావు, జిల్లా రిసోర్స్ పర్సన్ ప్రసాద్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు అంకయ్య, ప్రసాదు, ఉదయగిరి, మర్రిపాడు, అనంత సాగరం మండలానికి చెందిన సర్పంచ్లు, పంచాయతీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానంపై అవగాహన కలిగుండాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

రక్తదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రక్తదానం చేయటమంటే మరొకరికి ప్రాణదానం చేయడమని సిఐ గిరిబాబు పేర్కొన్నారు. సోమవారం స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల మెరిట్ ఇంజనీరింగ్ కళాశాల సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని సిఐ గిరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన సిఐ గిరిబాబు తొలుతగా రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తదానంపై ప్రతిఒక్కరూ సంపూర్ణ అవగాహన కలిగి రక్తదానం చేయడమంటే మరొకరికి ప్రాణ దానం చేయడంతో సమానమన్నారు. రెండు జిల్లాలకు సరిహద్దు ప్రాంతమైన ఉదయగిరి ప్రశాంతతకు మారుపేరని ఇక్కడ క్రైమ్ రేట్ చాలా తక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రకృతి ఒడిలో ఉన్నట్లే అనిపిస్తూ ఉంటుందని అనేక ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ఈ వాతావరణానికి చక్కగా అలవాటు పడిపోతారన్నారు. మంచి విద్యను అభ్యసించి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ రక్తదాన శిబిరంలో సిఐ గిరిబాబు, ఎస్ఐ ప్రభాకర్‌తో పాటు మరో 100 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదాన శిబిరం అనంతరం ఉదయగిరి సబ్ బ్రాంచ్ రెడ్ క్రాస్ చైర్మన్ షేక్.గాజుల ఫరూక్ అలీని కళాశాల ప్రిన్సిపాల్ శాలువాతో సత్కరించారు. అదేవిధంగా సబ్ బ్రాంచ్ చైర్మన్ షేక్.గాజుల ఫరూక్ అలీ సిఐ గిరిబాబును సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల డీన్ మురళీకృష్ణ, మెరిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఖాన్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ రవీంద్రనాథ్ ఠాగూర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకరణాలు బహూకరణ



ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం, పాత బిట్రగుంట, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఇఒ జయంత్ బాబు ఆధ్వర్యంలో సనాతన ఫౌండేషన్ వారు 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ఉపకరణాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు జి గంగాధర్ రావు, ఫౌండేషన్ అధ్యక్షులు బొద్దుకూరి నారాయణరావు విద్యార్థులకు పరీక్ష అట్టలు,పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్లు అందజేసి పరీక్ష సమయమందు విద్యార్థులు తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలు గురించి వివరించారు.

లారీని ఢీకొన్న మినీవ్యాను

ప్రజాశక్తి-సంగం

ఎదురుగా వస్తున్న లారీని మినీవ్యాను ఢీకొన్న ఘటన మండలంలోని దువ్వూరు వద్ద జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. కర్ణాటక వైపు నుండి నెల్లూరు వైపు వెళ్తున్న మినీ వ్యాను నిద్రమత్తులో ఎదురుగా వస్తున్న లారీని ప్రమాదవశాత్తు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలవగా.. వ్యాను బాగా దెబ్బతింది. రోడ్డు ప్రమాదం నడి రోడ్డుపై జరగడంతో కొద్దిసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ పునరుద్ధరించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని సన్నువారిపల్లి నుండి ఏపిలికుంట వెళ్లు రోడ్డు పక్కన ఇంటి ఎదురుగా తోటలో మేస్తున్న గొర్రెలను పట్టుకు వెళ్లేందుకు ప్రయత్నించిన ముగ్గురు నిందితులను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాల మేరకు.. గొర్రెలను ఎత్తుకెళ్లడాన్ని గమనించిన యజమాని దుద్దుగుంట శ్రీనివాసులు రెడ్డి అనుమానంతో ఎవరు మీరు అనగా పరుగెత్తడంతో స్థానికులు వారిని వెంబడించి ఖాదర్‌పూర్ క్రాస్‌రోడ్డు వద్ద దుండగులను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పట్టుబడ్డ వారు సంగం మండలానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఇద్దరిని అరెస్టు చేయగా మరో ఒకరు పరారీలో ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీరితోపాటు తెచ్చుకున్న ఎక్సెల్ వాహనాన్ని స్వాధీనం చేసుకోగా మరొక వ్యక్తి ఆటోతో అక్కడ నుండి పరారయ్యాడు. ఇటీవల మండలంలో జరిగిన దొంగతనాలకు వీళ్లే కారణమని స్థానికులు అంటున్నారు.

పొగాకు బ్యారెన్ దగ్ధం


బ్యారెన్‌లో పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని రాంపల్లి గ్రామానికి చెందిన మల్లవరపు శ్రీనివాసులు రెడ్డి పొగాకు బ్యారెన్ అగ్నికి ఆహుతి అయింది. కౌలుకు బ్యారెన్ తీసుకొని పొగాకు క్యూరింగ్ జరుపుతున్న సమయంలో ఆకురాలి గొట్టాలపై పడటంతో మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో ఇన్‌ఛార్జి ఫైర్ స్టేషన్ అధికారి రమణయ్య, హరిబాబు రవీంద్ర వేమారెడ్డి హుటాహుటిన వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ సంఘటనలో లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు రైతు వాపోయారు. బోర్డు అధికారులు తమకు న్యాయం చేయాలని రైతు కోరారు.

గుళికలు తిని గిరిజనుడు మృతి

ప్రజాశక్తి-అల్లూరు

మండలంలోని బీరంగుంట ఇటుక బట్టీల వద్ద సోమవారం ఇనమాల లక్ష్మయ్య అనే గిరిజన వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుళికలు తిన్న వెంటనే స్థానిక ప్రభుత్వం వైద్యశాలలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలియజేశారు. మృతుడు విడవలూరు మండలం దండిగుంట గ్రామవాసి కాగా గత 8 సంవత్సరాల నుండి దాసరి వెంకటరమణయ్య అనే ఇటుక బట్టీల యజమాని వద్ద పనిచేస్తూ ఉండే వారిని తెలిపారు. కొడుకు,కుమార్తె కరీంనగర్ వైపు పనులకు వెళ్లారని అలాగే మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

'ఉపాధి'ని పట్టణాలకు వర్తింపజేయాలి

ప్రజాశక్తి-కావలి


వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ఉపాధి హామీ పనులను పట్టణాలకు వర్తింపజేయాలని కోరుతూ సిపిఎం నాయకులు ఆధ్వర్యంలో సోమవారం కావలి ఆర్‌డిఒ వి. కె. శీనా నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ గ్రామీణ పేదల జీవన ప్రమాణాలను మెరుగుపడేందుకు 2005 సంవత్సరంలో అప్పటి కేంద్ర ప్రభుత్వంపై వామపక్ష పార్టీలు ఒత్తిడి మేరకు ఉపాధి హామీ చట్టాన్ని 100 రోజుల పనిదినాలుగా అప్పటి ప్రభుత్వం అమలు చేసినట్లు తెలిపారు. అయితే ఈ చట్టంలో కచ్చితంగా పని దినాలు అమలు కావడం లేదన్నారు. ప్రస్తుత బిజెపి కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నం చేస్తుందని ఉపాధి హామీ చట్టానికి తగిన బడ్జెట్ కేటాయించకుండా గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రతి ఉపాధి కార్మికుడికి రూ.250 ఇవ్వాల్సి ఉన్న అది అమలు కావడం లేదన్నారు. గ్రామీణ పేదరికం ఇంకా ఎక్కువైందని ఈ ఉపాధి పని దినాలను 200 రోజులకి పెంచాలని కోరారు. రోజుకు రూ. 600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా మున్సిపాలిటీ పరిధిలో కొన్ని గ్రామాలను విలీనం చేయడంతో పేదరికం ఎక్కువై పనులు లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ పథకాన్ని పట్టణ ప్రాంతాలలో కూడా ఈ చట్టంలో మార్పులు చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు జి.మధుసూదనరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-మర్రిపాడు


వైద్యం చేస్తున్న డాక్టర్లు

మండలంలోని చినమాచనూరులో టిడిపి ఆధ్వర్యంలో సోమవారం నారాయణ హాస్పిటల్ వైద్యులు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఉచిత శిబిరంలో ఊపిరితిత్తులు, ఎముకలు, కీళ్ల వైద్యులు పాల్గొని దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు తేజదీప్ మాట్లాడుతూ నారాయణ ఆసుపత్రి సిబ్బంది ఉచిత వైద్యశిబిరాలు రెండేళ్లుగా నిర్వహిస్తూ విజయవంతమయ్యాయన్నారు. మారుమూల ప్రాంతాల్లో ప్రజలు వైద్య సదుపాయాలు అందుబాటులో లేక దీర్ఘకాలిక వ్యాధులైన బిపి, షుగర్, హెర్నియా, మొలలు మొదలైన వ్యాధులతో బాధపడుతున్నారు. ప్రస్తుతం పలురకాల ఊపిరి తిత్తుల సమస్యలతో అల్లాడుతున్నారన్నారు. ఉచిత వైద్యశిబిరంలో వారి సమస్యలను కనుగొని దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని ఆసుపత్రి వాహనంలో నారాయణ వైద్యశాలకు తరలించి ఉచిత వైద్యపరీక్షలు చేసి సర్జరీలు మొదలైన ఇతర జబ్బులను ఆరోగ్యశ్రీ ద్వారా చేస్తామన్నారు.

బిల్లులపై అవాస్తవాలు సృష్టించారు

ప్రజాశక్తి-కావలి



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

జగనన్న కాలనీలో మూడవ వార్డుకు సంబంధించిన బిల్లులను లబ్ధిదారులు కాంట్రాక్టర్ వెంకట్రావుకు చెల్లించినా వాటిని పూర్తి చేయలేక కావాలని ఆరోపణలు చేస్తున్నారని, చెల్లింపులు చేసిన ఆధారాలు సైతం తమ దగ్గర ఉన్నాయని మూడవ వార్డు వైసిపి ఇన్‌చార్జ్ మండలి కృష్ణారావు తెలిపారు. సోమవారం పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్‌లో ఆయన మూడవ వార్డులోని జగనన్న కాలనీ లబ్ధిదారులతో కలసి మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తమ వార్డులో 16 మంది లబ్ధిదారులు ఉన్నారని, వారి నుంచి మెదటిలో బెస్‌మెంట్స్ వేసేందుకు ఒక్కొక్కరి నుంచి రూ.10వేలు కాంట్రాక్టర్ వెంకట్రావుకు చెల్లించామన్నారు. వాటి ఆధారాలు సైతం మీడియా ముందు ప్రవేశ పెట్టారు. అయితే బెస్ మెంట్స్ కట్టిన తరువాత వచ్చిన బిల్లులు సైతం సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారులు చెల్లించినట్లు తెలిపారు. ఇంక అతనికి ఇవ్వాల్సిన చెల్లింపులు రూ.15 వేల లోపేనని, వాటిని కూడా నిర్మాణం చేయాల్సిన వాటిని పూర్తి చేస్తే అవి కూడా చెల్లింపులు చేస్తామని తెలిపామన్నారు. అయితే కొన్ని ఇళ్లను పూర్తి చేయనందుకు ప్రశ్నించినందుకే తమపై కావాలని అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. తమపై ఆరోపించిన ఆరోపణలు అతను రుజువుచేస్తే అంతకు రెండింతలు చెల్లిస్తామని తెలిపారు. అలానే లబ్ధిదారులు కూడా కృష్ణారావు కాంట్రాక్టర్‌కు ఎటువంటి అప్పు లేరని మేమే అతనికి ఇవ్వాల్సిన డబ్బులు ఇచ్చామన్నారు. కావాలని అతను ఇలా చేయటం మంచి పద్ధతి కాదని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకుడు మాజీ కౌన్సిలర్ వడ్లమూడి వెంకటేశ్వర్లు, మూడవ వార్డు వైసిపి నాయకులు అన్వర్, షేక్.నజీర్, షఫీవుల్లా, లబ్ధిదారులు విజయభారతి, ఆదెమ్మ, రజియా, శారద, తదితరులు పాల్గొన్నారు.

మెట్రోరైలు మంజూరు వివరాలు తెలపాలి

ప్రజాశక్తి-నెల్లూరు


మాట్లాడుతున్న వేమిరెడ్డి

వివిధ రాష్ట్రాలకు మెట్రో రైలు మంజూరు కోసం అనుసరిస్తున్న ప్రమాణాల వివరాలు తెలియజేయాలని సోమవారం పార్లమెంట్‌లో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014లోని 13వ షెడ్యూల్‌లోని 12వ పారా ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం విధిగా మెట్రో రైలు సౌకర్యం ఏర్పాటుకు ఆదేశిస్తుందా అని ప్రశ్నించారు. అలా అయితే, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 12వ పారాకు అనుగుణంగా ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలను తెలపాలన్నారు. అందుకుగానూ స్పందించిన కేంద్రమంత్రి కౌషల్ కిషోర్, మెట్రో రైల్ పాలసీ, 2017 ప్రకారం, మెట్రో రైలు ప్రాజెక్టులను ప్రారంభించే బాధ్యత, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం/ కేంద్ర పాలిత ప్రాంతం (యు టి)కు సంబంధించిన విషయమన్నారు.

డిడిఒగా డాక్టర్ ఠాగూర్‌ను తొలగించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి


నిరసన చేపడుతున్న డాక్టర్లు, సిబ్బంది

మహిళ వైద్యులు సిబ్బందిపై ఆసభ్యకరంగా ప్రవర్తించే డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్‌ను డిడిఒగా తొలగించాలని ప్రభుత్వ ఆరోగ్య కేంద్ర వైద్యులు సిబ్బంది నిరసన తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఎదుట సిబ్బంది తలపెట్టిన ఈ ఆందోళన నిరసన కార్యక్రమానికి ఎంఆర్‌పిఎస్, బిఎస్‌పి నాయకులు పాల్గొని తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు సిబ్బంది మాట్లాడుతూ వైద్యశాలలో రవీంద్రనాథ్ ఠాగూర్ పనిచేస్తున్న క్రమంలో మహిళా సిబ్బందిపై లైంగిక వేధింపులకు పాల్పడి అరెస్టు కాపడటం, పోలీస్ స్టేషన్ నుంచి తప్పించుకుని పారిపోవడం, సస్పెన్షన్‌కు గురైన అదే వైద్యులు రవీంద్రనాథ్ ఠాగూర్‌ను తిరిగి ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకే తిరిగి రావడం తమపై అసభ్య పదజాలం వాడుతూ పేదలకు అందిస్తున్న సేవలకు విధులకు ఆటకం కలిగించడం తమకు బాధాకరంగా ఉందన్నారు. డ్రాయింగ్ ఆఫీసర్‌గా ఓ మహిళ డాక్టర్ లీలావతి కాదని వివాదాలకు నెలవుగా మారిన డాక్టర్ ఠాగూర్‌కు డ్రాయింగ్ ఆఫిసర్ హోదా కల్పించటం ఏమిటని వైద్యశాల సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు బకీరు జాషువా మాదిగ మాట్లాడుతూ సిబ్బంది పట్ల కానీ రోగుల పట్ల కానీ కనీసగౌరవం, మర్యాద పాటించని డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్‌కు తెలియవని మహిళా సాధికారత గురించి మహిళా అభ్యున్నతి గురించి మహిళ ఆత్మగౌరవం గురించి రాష్ట్ర ప్రభుత్వం పదేపదే చెబుతూ పనిచేస్తుందన్నారు. ఆ విషయం ఈ వైద్యుడి విషయంలో పచ్చి అబద్ధంగా మారిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేసుల్లో ఉండి క్రమశిక్షణ చర్యల కింద సస్పెండ్ అయి పోస్టింగ్ తీసుకున్న వ్యక్తికి ఉన్నతాధికారులు డ్రాయింగ్ ఆఫీసర్‌గా అధికారాన్ని ఎలా కట్టబెట్టారో అర్థం కావటం లేదని ఆయన విమర్శించారు. ఈ వైద్యుడి ప్రవర్తన పరిస్థితులు ఇలా ఏ కొనసాగితే తాము ఉద్యోగం చేయలేమంటూ వైద్యశాలలోనే మహిళా సిబ్బంది అందరూ ముక్తకంఠంతో మాట్లాడటం దురదృష్టకరమని తెలిపారు. వెనుకబడిన ప్రాంతం కావడం వల్ల వైద్య సేవలకు వంద కిలోమీటర్లు వెళ్లాల్సిన దుస్థితి ఈ ప్రాంత ప్రజలు పేదవాళ్లు ప్రభుత్వ వైద్యశాలపైనే ఆధారపడతారన్నారు. అలాంటి వైద్యశాలలో రోగులకు కానీ సిబ్బంది కానీ కనీస గౌరవం లేకపోతే వారు విధులు బహిష్కరించి వెళ్లిపోతే ఈ ప్రాంత ప్రజల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కష్టపడి పని చేసే వైద్యులకే డ్రాయింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు అప్పజెప్పాలని ఈ ప్రాంత పరిస్థితి కూడా దృష్టిలో ఉంచుకొని ఇలాంటి వైద్యులను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.ఎస్.పి. నాయకులు శ్రీరాములు, డాక్టర్లు సింధూర, అనిషా, శంషుద్దీన్, సిబ్బంది రమాదేవి, ఫార్మసిస్ట్ రాజేశ్వరి, కౌన్సిల్ సువార్త, సతీష్, రవి పాల్గొన్నారు.

బిల్లులు ఇవ్వకుండా వేధింపులు

ప్రజాశక్తి-కావలి



మాట్లాడుతున్న వెంకట్రావ్

కావలి పట్టణం ముసునూరు మెగా లే అవుట్ జగనన్న కాలనీలో బేస్‌మెంట్స్ వేసిన బిల్లులను లబ్ధిదారుల నుంచి మూడవ వార్డు ఇన్‌ఛార్జి తీసుకుని తనకు ఇవ్వటం లేదని బేస్‌మెంట్స్ వేసిన కాంట్రాక్టర్ కె.వెంకట్రావు తెలిపారు. సోమవారం పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్‌లో ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పట్టణంలోని 1, 2, 3, 6, 10, 11 వార్డులలో కొంతమంది లబ్ధిదారుల ఇళ్లను మున్సిపల్, హౌసింగ్ అధికారులు తనకు కేటాయించారని, వాటిని బేస్‌మెంట్స్ నిర్మించగా, ఆ బిల్లులు పోయిన సంవత్సరం ఆగస్టులో లబ్ధిదారుల అకౌంట్స్ నందు ప్రభుత్వం వేయగా ఆ డబ్బులను మూడవ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి మండలి కృష్ణారావు తీసుకుని ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆ ఇళ్లకు రూ.6 లక్షలు ఖర్చు పెట్టానని తెలిపారు. అయితే ఆ డబ్బులు ఇంతవరకు రాకపోతే, ఇప్పుడు హౌసింగ్ అధికారులు వాటిని పూర్తి చేయాలని తనపై కేసు పెట్టారన్నారు. ఈ విషయాన్ని ఎంఎల్ఎ ప్రతాప్ కుమార్ రెడ్డి, ఆర్‌డిఒ, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లి ఉన్నానని తనకు ఆ డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

చిరుధాన్యాలతో పోషక విలువలు



అల్లూరులో...

ప్రజాశక్తి-అల్లూరు

చిరుధాన్యాలతో సమృద్ధిగా పోషక విలువలు ఉంటాయని ఎంపిపి దర్శిగుంట శశిరేఖ తెలిపారు. సోమవారం మండలంలోని ఇస్కపల్లి గ్రామంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా విచ్చేసి పలు విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు జగన్మోహన్ రెడ్డి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నారని తద్వారా ఎంతో ఉపయోగకరమని తెలియజేశారు. కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడం జరిగిందన్నారు. ఇప్పటికే అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో చిరుధాన్యాల ప్రాముఖ్యతను ఐసిడిఎస్ అధికారులు వివరిస్తూ విరివిగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజేశ్వరీ, సర్పంచ్ పాటి రంజిత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ, వైసిపి నాయకులు దర్శిగుంట వెంకయ్య తదితరులు ఉన్నారు. అలాగే బీరంగుంట గ్రామంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సునీత ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించగా స్థానిక వైసిపి నాయకులు ఉప సర్పంచ్ గుమ్మడి సాయిచరణ్, గరిక నరసింహారావు, నార్త్ ఆములూరు కార్యదర్శి అనిత పాల్గొని బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు పోషకాహారాలను అందించారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని అనుమసముద్రం సెక్టార్ పరిధిలోని తెల్లపాడు గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్ వద్ద సోమవారం పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ఆత్మకూరు సిడిపిఒ జైన్ కుమారి ఎసిడిపిఒ శ్రీలత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ 20వ తేదీ నుంచి ఏప్రిల్ మూడవ తేదీ వరకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. చిన్నారుల్లో ఐరన్ లోపం పోషకాహార లోపం లేకుండా వైద్య సిబ్బంది ద్వారా పరీక్షలు చేయించి సూచనలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అలాగే రక్తహీనతను తగ్గించే విధంగా ఆహారపు అలవాట్లను గురించి వివరించారు. చిరుధాన్యాలు తినడం వల్ల రక్తం మెరుగుపడుతుందని తెలిపారు. అలాగే కిషోర్ బాలికలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అనుమ సముద్రం సెక్టార్ సూపర్‌వైజర్ కస్తూరి, విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : చిరు ధాన్యాలు, సమతుల్య ఆహారం తీసుకుంటే గర్భిణులు, బాలింతలు, తల్లులు, సంపూర్ణ ఆరోగ్యవంతులు అవుతారని ఐసిడిఎస్ ఎసిడిపిఒ శారద పేర్కొన్నారు. సోమవారం స్థానిక కచేరిమిట్ట, బుడమగుంట గేట్ అంగన్‌వాడీ కేంద్రాలలో ఆమె ఆధ్వర్యంలో "పోషణ పక్వాడ్" వారోత్సవాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమతుల్య మైన ఆహారం తీసుకుని, ఆరోగ్యావంతంగా తల్లీబిడ్డలు వర్ధిల్లాలని పిలుపునిచ్చారు. గర్భకోశ వ్యాధి నిపుణులు డాక్టర్ మాధవిలత మాట్లాడుతూ గర్భిణులు అదనపు ఆహారం తీసుకుని ఆరోగ్యవం తంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బి.వి. సుభాషిణి, అంగన్‌వాడీ కార్యకర్తలు సి హెచ్.విజయ లత, ప్రసన్నకుమారి, విజయలక్ష్మి, వార్డు లోని పెద్దలు తిరివీధి ప్రసాద్, విన్సెంట్, మీకోసం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు రాయపాటి దిలీప్‌కుమార్, సభ్యులు గిరిబాబు, ఆయాలు, తల్లులు, గర్భవతులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.



కావలిలో..


మాట్లాడుతున్న ఎంఎల్ఎ రామిరెడ్డి

సమస్యను పరిష్కరిస్తాం..

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు పంచాయితీ బంగారు అంగళ్ల పక్కన ఉన్న మద్యం దుకాణం సమస్యను పరిష్కరిస్తామని ఎంఎల్ఎ శాసనసభ్యుడు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు నివాసముంటున్న బోగోలు బజారు బంగారు అంగళ్ల వీధిలో ఉన్న మద్యం దుకాణం వల్ల ముస్లిం సోదరులు ఇబ్బందులకు గురవుతున్నారని మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, ముస్లిం సోదరులు తమ దృష్టికి తీసుకొచ్చారని మద్యం దుకాణాన్ని ప్రత్యామ్నాయంగా వేరే చోట మార్చేందుకు అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ రఘు మాట్లాడుతూ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి సమస్యను పరిష్కారమయ్యేలా సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడారని, ముస్లిం సోదరులు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో వైసిపి ముస్లిం నాయకులు నాయబ్ రసూల్, నౌషాద్, ప్రసాద్, ముస్లిం సోదరులు, నాయకులు తదితరులున్నారు.

కౌలురైతు ఆత్మహత్యపై విచారణ

ప్రజాశక్తి-బిట్రగుంట


పొలంలో పరిశీలిస్తున్న అధికారులు

బోగోలు మండలం పాత బిట్రగుంట అరుంధతీయ వాడకు చెందిన కౌలు రైతు పరుస రమణయ్య గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్న దానిపై సోమవారం తహశీల్దార్ లక్ష్మీనారాయణ, మండల వ్యవసాయ అధికారిణి విజయలక్ష్మి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ కావలి ఆర్‌డిఒ ఆదేశాల మేరకు రమణయ్య ఎంత పొలం కౌలు తీసుకొని సాగు చేశారు.. ఎంత నష్టపోయాడనేది పరిశీలించి పూర్తి నివేదిక రెండు రోజుల్లో ఉన్నతాధికారులకు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్


మాట్లాడుతున్న ఎంపిపి కేతా వేణుగోపాల్‌రెడ్డి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా గ్రామాల అభివృద్ధికి దోహద పడుతుందని ఆత్మకూరు ఎంపిపి కేతా వేణుగోపాల్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని వెన్నవాడలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా గ్రామాలలో సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి నిధులు మంజూరు అయి తద్వారా గ్రామాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 233 సమస్యలు గుర్తించబడ్డాయని వీటిలో 173 సమస్యలు పరిష్కరించామని తెలిపారు. మిగిలిన 60 సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. అగ్రికల్చర్ అధికారి కిషోర్ బాబు, వెన్నవాడ, పదకండ్ల సర్పంచ్లు జగన్నాథం లక్ష్మమ్మ, మాముడూరు నరసింహులు, ఎంపిటిసి కంభం శెట్టి ప్రమీల, సొసైటీ అధ్యక్షుడు బలరామ నాయుడు, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, భాను, విఆర్ఒ సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న దృశ్యం

అశోక్‌రెడ్డికి మాతృవియోగం

ప్రజాశక్తి-కోవూరు

మండలంలోని పోతిరెడ్డిపాలెం టిడిపి నాయకులు, తిరు మూరు అశోక్ రెడ్డి మాతృమూర్తి, కోటేశ్వరమ్మ సోమవారం మతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని సిపిఎం నాయకులు, లాయర్ జక్కా శేషమ్మ, గండవరపు శ్రీనివాసులు, గండవరపు శేషయ్య, బుజ్జయ్యలు సందర్శించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారివెంట ఎంపిటిసి నాగరాజు, మాజీ సర్పంచ్ కష్ణ ప్రసాద్, కొల్లా అదిశేషా రెడ్డి, వాహిద్, మాజీ కో ఆప్షన్ జహంగీర్‌లున్నారు.

స్పందనలో ఐదు అర్జీలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. పలు సమస్యలపైన ఐదు అర్జీలను అర్జీలను తహశీల్దార్ లక్ష్మీ నరసింహంకు అందజేశారు. అర్జీదార్లకు తహశీల్దార్ అర్జీలను పరిశీలించి త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

భోజన ప్యాకెట్లు వితరణ

ప్రజాశక్తి-కావలి



కావలి పట్టణం ప్రముఖ న్యాయవాది పి వి శివప్రసాద్ రెడ్డి అమ్మ పుల్లా.కనక రత్నమ్మ రెండో వర్ధంతి సందర్భంగా సంయుక్త సేవాసంస్థ ద్వారా కావలి పట్టణం పరిసర ప్రాంతమైన బుడంగుంట గిరిజనప్రాంతం, బాలక్రిష్ణారెడ్డి నగర్లోని గిరిజనులకు భోజనం ప్యాకెట్లు వితరణ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, సంస్థ శాశ్వత దాత ఎం.అజిత్ బాబు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొని భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎం.అజిత్ బాబు మాట్లాడుతూ న్యాయవాది పి వి శివప్రసాద్‌రెడ్డి అమ్మ పుల్లా.కనకరత్నమ్మ జ్ఞాపకార్థంగా పేదలకు ఆకలి తీర్చడం సంతోషంగా ఉందని తెలిపారు.



ఆర్‌టిఒ కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-కావలి

కావలి ఆర్‌టిఒ కార్యాలయం నూతన భవనానికి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సోమవారం భూమిపూజ నిర్వహించారు. స్థానిక రుద్రకోటలోని పాలిటెక్నిక్ కళాశాల పక్కన ప్రభుత్వం కేటాయించిన 5 ఎకరాల భూమిలో నూతన కార్యాలయ భవన సముదాయానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కావలి ఆర్‌టిఒ వై సుధాకర్ రెడ్డి, ఎంఎంవిఐ సుందర్ రావు, ఎఎంవిఐ కరుణాకర్ ఆర్‌టిఒ, మురళీ మోహన్, ఎం.వి.ఐ. బాల మురళీకృష్ణ, జిల్లాలోని రవాణా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

29న టిడిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-ఉదయగిరి



తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం 29వ తేదీన జరుగుతుందని నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని మండల అధ్యక్షులు చింతనబోయిన బయ్యన్న పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మాజీ శాసనసభ్యులు బొల్లినేని వెంకట రామారావు ఆదేశాలమేరకు 29వ తేదీన బుధవారం టిడిపి ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉదయం 9 గంటలకు పార్టీ జెండా ఆవిష్కరణ, భారీ కేక్ కటింగ్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంఎల్ఎ కంభం విజయరామిరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చెంచల బాబు యాదవ్ పాల్గొంటారు. కావున మండలంలోని నాయుకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

గంగమ్మకు పొంగళ్లు

ప్రజాశక్తి-సంగం

సంగంలోని పెన్నానది ఒడ్డున వెలసిన శ్రీ పాలేటి గంగమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి నెల పొంగళ్ల కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని విశేష పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పొంగళ్ళు సమర్పించుకున్నారు. అనంతరం గ్రామంలో అమ్మవారి పల్లకీ సేవను తప్పెట్లు తాళాలు, డీజే చప్పుళ్లతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు భరత్ కుమార్ యాదవ్ అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.